చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఒకేరోజు ఐదు చైన్ చోరీలకు పాల్పడిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బావారియా గ్యాంగ్‌లోని కీలక వ్యక్తిని తిరుపతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు వివరాల మేరకు.. తిరుపతిలో అక్టోబరు 4న ఇద్దరు వ్యక్తులు మూతికి మాస్క్, తలకు టోపీ ధరించి పల్సర్ వాహనంలో తిరుగుతూ ఎస్టీవీనగర్, మంగళం, ఉపాధ్యాయనగర్ తదితర ప్రాంతాల్లో ఐదుగురు మహిళల మెడల నుంచి బంగారు చైన్లు లాక్కొని పరారైన విషయం విదితమే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుర్మక్ తన ఇద్దరు సహచరులు జయరాం, మోహన్‌తో కలసి ఈ చోరీలకు పాల్పడినట్లు గుర్తించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆటోనగర్‌లోని రైల్వేగేట్ సమీపంలో మంగళవారం గుర్మక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. అతని నుంచి బైక్, బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబును ఎస్పీ అభినందించారు.



మృగరాజుపై యోగనరసింహుడిగా..

● భక్తులను కటాక్షించిన పద్మావతి

తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరచానూరులోని పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం ముత్యపుపందిరిపై అమ్మవారు శ్రీధనలక్ష్మి రూపంలో భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, వేద, ప్రబంధ పారాయణం, భజన బృందాల ప్రదర్శనలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ తిరువీధుల్లో ముత్యపుపందిరి వాహనం ముందుకు సాగింది. మధ్యాహ్నం శ్రీకృష్ణ ముఖమండపంలో ఉత్సవమూర్తికి నేత్రానందంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి సింహవాహనంపై యోగనరసింహుడి రూపంలో అమ్మవారు తిరుమాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. కళాబృందాల సాంస్కృతిక నీరాజనంతో అమ్మవారి సింహవాహన సేవ అత్యంత రమణీయంగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం: కల్పవృక్ష వాహనం
మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ
రాత్రి: హనుమంత వాహనం





నేడు తిరుమలకు రాష్ట్రపతి రాక

● గవర్నర్ పర్యటన రద్దు ● స్వాగతం పలకనున్న మంత్రులు

తిరుమల, తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం తిరుమల రానున్నారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఆమెకు స్వాగతం పలికేందుకు గవర్నర్ రావాల్సి ఉన్నా.. చివర్లో ఆయన రద్దయింది. దీంతో హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు.. పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ అధికారులు స్వాగతం పలకనున్నారు. ఒడిశా నుంచి రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం 4గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. రోడ్డు మార్గాన 4.30గంటలకు తిరుచానూరుకు వచ్చి పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. 5.20 గంటలకు బయలుదేరి తిరుమలకు వెళ్లి పద్మావతి అతిథి గృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9.20గంటలకు వరాహస్వామిని, ఆ తర్వాత శ్రీవారి ఆలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకుంటారు. 11 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు బయలుదేరతారు.

భారీ భద్రత: విజయవాడలోని ఓ ఇంట్లో మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలతో రాష్ట్రపతి పర్యటనకు భారీ భద్రత ఏర్పాటు చేశారు. డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఐదుగురు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, 300 మంది పోలీసులు, రోడ్డు ఓపనింగ్ పార్టీలు, రోప్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్‌లు, పారా మిలటరీ దళాలు, రిజర్వు బలగాలు, ఏరియా డామినేషన్ పార్టీలను బందోబస్తు నిమిత్తం నియమించారు. వీరు కాకుండా రాష్ట్రపతి వెంట కమెండో దళాలు ఉంటాయి. కేంద్ర బలగాలూ మోహరించనున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి తిరుమల వరకు పటిష్ఠ బందోబస్తుతో పాటు బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. బుధవారం కూడా కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ భద్రతా ఏర్పాట్లపై ఆలయం వద్ద చర్చించారు.



భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న అదనపు ఈవో, కలెక్టర్, భద్రతాధికారులు

రైతుల ఖాతాల్లో రూ.104.15 కోట్ల జమ

నాయుడుపేట/టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన కింద 1,54,908 రైతుల ఖాతాల్లో రూ.104.15 కోట్లు జమయ్యాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఈ నిధులను బుధవారం విడుదల చేయగా, ఆయా నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలతో పాటు అన్ని సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి నాయుడుపేటలో జరిగిన సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ పథకం, ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, ఏడీ ధనంజయరెడ్డి, ఏవోలు గణేష్, గాయత్రి, ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఆకుతోట రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మీపై మనీల్యాండరింగ్ కేసు

● సీబీఐ అంటూ సీనియర్ సిటిజన్‌కు వాట్సాప్ కాల్ ● డిజిటల్ అరెస్టు పేరిట రూ.80 లక్షల వసూలు ● తిరుపతిలో ఎనిమిది మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మేము ముంబై సీబీఐ అధికారులం. మీపై రూ.583 కోట్ల మనీల్యాండరింగ్ కేసులో మీ పేరుంది. వాట్సాప్ కాల్ ద్వారా మిమ్మల్ని విచారిస్తున్నాం' అంటూ డిజిటల్ అరెస్టు పేరిట భయపెట్టారు దీన్నుంచి బయట పడాలంటే రూ.80 లక్షలు పంపాలంటూ ఒత్తిడి చేశారు. ఇలా తిరుపతిలోని 65 ఏళ్ల సీనియర్ సిటిజన్ నుంచి వివిధ ఖాతాలకు నగదు వేయించుకున్న ఎనిమిది మంది సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరి జాయింట్ అకౌంటులోని దాదాపు రూ.2.5 లక్షలను ఫ్రీజ్ చేశారు. ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. డిజిటల్ అరెస్టుకు భయపడిన తిరుపతివాసి నుంచి రూ.80 లక్షలను వివిధ రాష్ట్రాల్లోని మ్యూల్ ఖాతాల్లోకి సైబర్ నేరగాళ్లు జమ చేసుకున్నారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో డీఎస్పీ భక్తవత్సలం స్వీయ పర్యవేక్షణలో ఎస్ఐలు, సిబ్బంది ప్రత్యేకంగా ఢిల్లీ వెళ్లి నిందితుల కోసం గాలించారు.

చివరికి డబ్బులు చేరింది ఎక్కడికంటే..

బాధితుడి అకౌంటు నుంచి రెండు మ్యూల్ అకౌంట్లకు నగదు జమ చేయించారు. ఆ మ్యూల్ ఖాతాల నుంచి 14 రాష్ట్రాల్లోని ఇతర అకౌంట్లకు ఆ మొత్తం చేరింది. చివరికి.. గేమింగ్ యాప్ వినియోగదారులకు ఆ మొత్తం చేరినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ప్రధాన నిందితుడు కోటి బాబుకు టెలిగ్రామ్ ద్వారా హరియాణాలోని డానియల్, చైనాకు చెందిన టియాన్, ఇంకా డీ పేర్లతో ఉన్న విదేశీ నెట్‌వర్కులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. గతేడాది జనవరిలో కోటి బాబు కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు సైబర్ నేరగాళ్లతో కలిసి పనిచేసి తిరిగి హైదరాబాదుకు వచ్చాడు. ఇక, క్రాంతి కుమార్, పవన్ కుమార్ కలిసి తప్పుడు పత్రాలతో డీకేకే ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ పేరిట జాయింట్ కరెంట్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆ ఖాతాలోకి రూ.30 లక్షలు జమకాగా.. ఆ తర్వాత విదేశీ సైబర్ నెట్‌వర్క్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు నిర్ధారించారు. మరికొన్ని కేసుల్లోనూ ఈ ఖాతాను వినియోగించినట్లు బయటపడింది. వాటిపైనా దర్యాప్తు కొనసాగుతోంది. అదనంగా, ఈ అకౌంట్ తెరవడంలో సంబంధిత బ్యాంక్ ఉద్యోగుల ప్రమేయం ఉందా అనేది దానిపైనా విచారిస్తున్నారు.

అరెస్టయింది 8 మంది వీరే

దండే క్రాంతికుమార్, నిమ్మల పవన్‌కుమార్ (అనంతపురం), మానే కోటిబాబు, గుండవేని గౌతమ్ (హైదరాబాదు), పరపాల శ్రీనివాస్ (రాజమండ్రి), ఎం.చంద్రశేఖర్, శివశంకర్, నగారిధన్ ప్రశాంత రెడ్డి (బళ్లారి)అరెస్టయిన వారిలో ఉన్నారు. ఇక, కీలక నిందితుడు హైదరాబాదులోని యూసఫ్‌గూడకు చెందిన మొహమ్మద్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

అలాంటి వారితో జాగ్రత్త

'నీ అకౌంట్ నుంచి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తే కమీషన్ ఇస్తాం. కేవైసీ పంపు. నెలవారీ ఆదాయం వస్తుంది. కరెంట్ అకౌంట్ ఓపెన్ చేస్తే జీతం వస్తుంది' అని ఎవరైనా చెప్పారంటే.. వాళ్లు సైబర్ నేరగాళ్లే. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలంటూ ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. డిజిటల్ అరెస్టుల పేరిట ఎవరైనా బెదిరిస్తే 112 లేదా సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబరు 1930 కు ఫోనుచేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు శ్రీనివాసులు, వినోద్‌కుమార్, ఎస్ఐలు హేమాద్రి, నాగార్జున రెడ్డి, లోకేష్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

స్వర్ణమ్మకు గంగా హారతి



గంగాదేవి ఉత్సవమూర్తికి పూజలు



స్వర్ణమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే



నదీ హారతులు ఇస్తున్న వేదపండితులు

కార్తీక మాసం.. అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్వర్ణముఖి నదికి గంగా హారతులిచ్చారు. తొలుత ముక్కంటి ఆలయం నుంచి గంగాదేవి ఉత్సవమూర్తిని స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. నదీ జలాలకు, ఉత్సవమూర్తికి పండితులు పూజలు చేశారు. గంగాదేవికి శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు స్వర్ణమ్మకు ద్వాదశ(12) హారతులు పట్టారు. ఆగమ నియమాల ప్రకారం వివిధ రకాల హారతులను వరుసగా గంగమ్మకు సమర్పించారు. పలువురు భక్తులు నదీ దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు స్వర్ణముఖి నది వద్ద విద్యుత్తు అలంకరణలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్, బొజ్జల బృందమ్మ, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు, ఈవో బాపిరెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం





అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ఫలపుష్పాలతో అందంగా తీర్చిదిద్దిన స్నపన తిరుమంజన మండపం

పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి పాంచరాత్ర ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఫల పుష్పాలతో సుందరంగా అలంకరించి ఈ మండపంలో వేద మంత్రాలు, గోవింద నామ స్మరణల నడుమ పాలు, పెరుగు, తేనె సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. మండపాన్ని వివిధ రకాల సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో పాటుఆపిల్, ఆర్కిడ్స్ ఫలాలతో అలంకరించారు. కాగా, స్నపన తిరుమంజనంలో అమ్మవారికి ఎండు ఫలాలు, పుష్పాలే ఆభరణాలయ్యాయి. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

గ్రంథాలయంలో మహిళలకు సన్మానం



మహిళలను సన్మానించిన గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు

పాకాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయంలో బుధవారం మహిళలను సన్మానించారు. మహిళా దినోత్సవం, ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, మెరుగైన సమాజ నిర్మాణానికి కృషిచేయాలని గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు కోరారు. ఉపాధ్యాయినులు కె.పుణ్యవతి, వసుంధరదేవి, ఎం.విజయలక్ష్మి, బేబి, మోహనకుమారి, నాగిణిబేగం, ఇందిరా సుమలత, కె.పద్మావతి, సామాజిక కార్యకర్త లీలారాణి, పాఠకురాలు మోహనమ్మలను ఘనంగా సన్మానించారు. అలాగే దామలచెరువు గ్రంథాలయంలో సర్పంచ్ సునీత, ఉపాధ్యాయులను గ్రంథాలయ అధికారి మురళీబాబు, టీడీపీ నాయకులు పి.చలపతి నాయుడు, వెంకటేష్, సురేంద్రలు సన్మానించారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే ఘన నివాళి

చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీకి చెందిన డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడికి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు ఘన నివాళి అర్పించారు. సుబ్రమణ్యం నాయుడు మృతి చెంది మూడు నెలలు అవుతుంది. బుధవారం ఆయన స్వగ్రామంలో నిర్వహించిన మూడో నెల బట్టలు పెట్టే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాని దంపతులు హాజరయ్యారు. ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుబ్రమణ్యంనాయుడి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవిందధామానికి రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే నానికి విరాళాన్ని అందిస్తున్న తిరుపతి క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి స్వర్ణముఖినది ఒడ్డున నిర్మిస్తున్న గోవిందధామానికి తిరుపతి క్రాకర్స్ అసోసియేషన్ రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం ఈ చెక్కును ఎమ్మెల్యే పులివర్తి నానికి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గోవింధధామం కమిటీ సభ్యులు వీరంగారి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని సంరక్షిస్తే దైవాన్ని పూజించినట్లే



కావలివారిపల్లెలో మొక్క నాటుతున్న సింగిల్‌విండో చైర్‌పర్సన్ సావిత్రి

పాకాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత పర్యావరణ పరిరక్షణలో భాగమేనని, ప్రకృతిని సంరక్షిస్తే దైవాన్ని పూజించినట్లేనని సింగిల్‌విండో చైర్‌పర్సన్ క్రిష్ణమనేని సావిత్రి అన్నారు. కార్తీక వన మహోత్సవంలో భాగంగా బుధవారం కావలివారిపల్లెలో సర్పంచ్ చెంగల్రాయులు, అటవీశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. మామిడి, అల్లనేరేడు తదితర మొక్కలను గ్రామ పరిసరాలలో నాటారు. అందరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు కె.భారతి, సుభాషిణి, గీత, జమున, రాణి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



పాకాల ఎస్వీఎన్ పాఠశాలలో ఎంఈవోలు బాబ్జీ, లింగయ్యలను సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

పాకాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో బుధవారం ఘనంగా పురుషుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, ఉపాధ్యాయులను ఉపాధ్యాయినులు ఘనంగా సన్మానించారు. కుటుంబం, వైవాహిక వ్యవస్థ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రోహిణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, నవంబరు 19((ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. తిరుపతికి చెందిన శాంతిలక్ష్మి బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఏఈవో సుధాకర్, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



కట్టకిందపల్లె రోడ్డు పక్కన రైలింగ్‌లోకి దూసుకెళ్లిన కారు

పాకాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారిలో పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కట్టకిందపల్లె వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దామలచెరువు వైపు వస్తున్న కారు రోడ్డు పక్కన రైలింగ్‌ను ఢీకొనడంతో, రైలింగ్ పైపులు కారులోకి దూసుకెళ్లాయి. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పదిపుట్లబైలుకు చెందిన విక్రం, ఉదయ్‌కుమార్, పాకాలకు చెందిన బద్రీలు తీవ్రగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని జడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 నెట్‌బాల్ పోటీలు పిచ్చాటూరులో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ముందస్తు అభినందనలు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు, తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ సెక్రటరీ కిషోర్, ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, పీఈటీలు స్వర్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బిల్వ పత్రాలు, కుంకుమ నిమజ్జనం



బిల్వ పత్రాలు, కుంకుమను నిమజ్జనం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బుధవారం బిల్వ పత్రాలు, కుంకుమ నిమజ్జనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో పదిరోజుల పాటు నిర్వహించిన లక్ష బిల్వ, కుంకుమ అర్చన పూజలు బుధవారంతో ముగిశాయి. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ బిల్వ పత్రాలు, కుంకుమను ఊరేగింపుగా స్వర్ణముఖి నది ఒడ్డుకు చేర్చారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలమండలి చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు, ప్రధాన అర్చకుడు కరుణ కరన్ గురుకుల్, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర కలశ పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అష్టోత్తర కలశ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ పూజలను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి దంపతులు, ఈవో బాపిరెడ్డి దంపతులు, పాలకమండలి సభ్యులు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక

పాడిరైతు ఆత్మహత్యాయత్నం



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులు శెట్టి

గంగాధరనెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవమానం భరించలేక ఓ పాడిరైతు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ముక్కళత్తూరు పంచాయతీ ఎం.నాశంపల్లె గ్రామానికి చెందిన నరసింహులుశెట్టి కొన్నాళ్ళ క్రితం కుమార్తె పెళ్లి కోసం గజేంద్ర అనేవ్యక్తి దగ్గర కొంత సొమ్ము అప్పు తీసుకున్నాడు. తర్వాత వీరిద్దరి మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. ఐదురోజుల క్రితం నరసింహులుశెట్టికి చెందిన పాడిఆవులను గజేంద్ర కుటుంబీకులు తీసుకుపోయారు. దీంతో నరసింహులుశెట్టి దంపతులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పాడిఆవులను వెంటనే రైతుకు అప్పగించాలని సీఐ శ్రీనివాసంతి ఆదేశించారు. గజేంద్ర పాడిరైతుకు ఆవులను అప్పగించాడు. ఈక్రమంలో సీఐ బుధవారం నరసింహులుశెట్టి, గజేంద్రలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. తాను తీసుకున్న రుణం ఆరు నెలలోపు చెల్లిస్తానని నరసింహులు చెప్పాడు. దీంతో సర్ది చెప్పి ఇద్దరినీ పంపేశారు. అయితే నరసింహులు స్టేషన్ బయటకు వస్తుండగా. గజేంద్రతో పాటు అతని మనుషులు అవమానకరంగా దూషించారు. దీంతో మనస్థాపానికి గురైన నరసింహులుశెట్టి ఇంటికి వచ్చి పురుగులమందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్టేషన్‌బయట ఏం జరిగిందో తెలియదని, పూర్తిస్థాయిలో విచారించి నివేదికను ఉన్నతాధికారులుకు అందజేస్తామని సీఐ చెప్పారు.

జైలు పార్టీ ఎన్ని విమర్శలు చేసినా...

సూపర్‌సిక్స్ సక్సెస్ చేశాం

- ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జైలు పార్టీ ఎన్ని విమర్శలు చేసినా సూపర్‌సిక్స్ పథకాలను సక్సెస్ చేయడమే కాకుండా రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం ఆర్‌సీపురం మండలంలోని రాయలచెరువుకట్ట వద్ద నియోజకవర్గ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథక లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. చేసిన అభివృద్ధి పనులను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి రానున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద చంద్రగిరి నియోజకవర్గంలో 26,062మంది రైతులకు రూ.17.86కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని చొరవ తీసుకుని రూ.150కోట్లతో రాయలచెరువును మినీడ్యాంగా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించారన్నారు. దీనిని అభివృద్ధి చేసేందుకు ఇరువురం చంద్రబాబును ఇప్పటికే కలిశామన్నారు. మనకు యూరియాను దిగుమతి చేసే దేశాలు యుద్ధాల్లో పాల్గొనడం వల్ల కొరత ఏర్పడిందన్నారు. దీనిని అధిగమించడానికి సేంద్రియ పంటలను పండించాలన్నారు. 40కేజీల యూరియా, డీఏపీ బస్తాలకు బదులు చిన్న లిక్విడ్ బాటిల్లో వచ్చే ద్రావణాన్ని వాడాలని సూచించారు. మామిడి రైతుల ధర స్థిరీకరణ కోసం పార్లమెంటు, అసెంబ్లీలో కృషి చేశామన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఏపీఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చిన్నబాబు, నాయకులు కేశవులు నాయుడు, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, గిరి నాయుడు, వ్యవసాయ శాఖ జేడీ ప్రసాదరావు, ఆర్డీవో రామ్మోహన్, వ్యవసాయశాఖాధికారిణి మమత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తొండవాడ మలుపు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు





తొండవాడ వద్ద ప్రమాదకరమైన మలుపు, మలుపు వద్ద ఎండిపోయిన చెట్టు

చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి చంద్రగిరి వెళ్లే మార్గంలో తొండవాడ ప్రధాన ముఖద్వారం ఎదుట గల మలుపు ప్రమాదకరంగా మారుతోంది. మలుపు తిరిగే రోడ్డు పక్కన ఎండిపోయిన చెట్టు, ఆక్రమణల వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆక్రమణలతో రోడ్డు వెడల్పు తగ్గిపోయి వాహనాలు సురక్షితంగా మలుపు తిరిగేందుకు అవసరమైన ప్రదేశంలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చే వాహనాల వలన తొండవాడ నుంచి రాకపోకలు సాగించేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. పాదచారులకు కూడా ఈ మలుపు ప్రమాదమే. వాహనదారులకు ఇబ్బందిగా ఉండే ఆక్రమణలు, చెట్లు తొలగించాలని నిబంధనలు ఉన్నాయి. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితంలేదని, రోడ్డు విస్తరణ సమయంలో వాటిని తొలగిస్తామని చెబుతున్నట్టు తెలుస్తోంది. ఎప్పుడో జరిగే రోడ్డు విస్తరణ వరకు వేచి చూడడం సరైంది కాదని, అధికారులు దృష్టిపెట్టి తొండవాడ మలుపును సురక్షిత మార్గంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతికూలతను ఎదుర్కొంటేనే విజయం

- విద్యార్థులతో ముఖాముఖిలో భువనేశ్వరి



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం/గుడుపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎదురొడ్డి నిలడితేనే విజయం సొంతమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి విద్యార్థులకు సూచించారు.కుప్పం నియోజకవర్గ పర్యటనలో తొలి రోజైన బుధవారం నాడు ఆమె ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. కొద్దిసేపు విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన అనంతరం వారినుంచి ప్రశ్నలను ఆహ్వానించారు. పలువురు విద్యార్థులు దీనిపై ఉత్సాహంగా స్పందించి, ఆమెపై ప్రశ్నలను సంధించారు. ప్రశ్నలన్నింటికీ భువనేశ్వరి ఓపిగ్గా, దీటుగా సమాధానం ఇచ్చారు. సీఎం చంద్రబాబులో మీకు నచ్చిన నాయకతవ్వ లక్షణం ఏమిటని విద్యార్థులు ప్రశ్నించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు సహనం కోల్పోకుండా, సమస్యను చక్కగా విశ్లేషించుకుని కార్యాచరణకు పూనుకునే లక్షణం తనకు ఎంతో ఇష్టమన్నారు. అలాగే అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలని, సేవారంగమే సామాజిక రంగానికి బాటలు వేస్తుందని మరో విద్యార్థి అడిగిన ప్రశ్నకు స్పందించారు. ఫలితం ఆశించకుండా సామాజిక సేవ చేయాలన్నారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం, సమయ పాలన వంటి ఉత్తమ లక్షణాలు కలిగిన నందమూరి తారకరామారావు, నారా చంద్రబాబు నాయుడు నుంచి తాను ఎంతో ప్రేరణ పొందానని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంద న్నారు. విద్యార్థులు మొదట చదువుపైన దృష్టిపెట్టి కర్తవ్యం నిర్వహించాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఉద్బోధించారు. పురుషులలో లేని, సహజమైన సహనశక్తి స్త్రీలకు సహజంగానే సంక్రమిస్తుందన్న భువనేశ్వరి, అందువల్లనే స్త్రీలు అన్ని పనులనూ సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం కలిగి ఉంటారని పేర్కొన్నారు. చంద్రబాబు మిన్నువిరిగి మీదపడ్డా చలించరని, ప్రతికూల పరిస్థితులను సైతం తనకు అనుకూలంగా మలచుకోవడంలో ఆయన చూపించే చొరవ తనకు బాగా నచ్చిన లక్షణమని పేర్కొన్నారు.

కొనసాగుతున్న జంట ఏనుగుల దాడులు

- గ్రామాల్లో అటవీశాఖ అధికారుల సూచనలు







ఏనుగుల దాడిలో పాక్షికంగా ధ్వంసమైన వరిపంట, రామకుప్పం-89 పెద్దూరు రహదారిలో జంట ఏనుగులు, ననియాలలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

రామకుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో పొలాలు, మామిడి తోటలపై జంట ఏనుగుల దాడుల పరంపర కొనసాగుతోంది. దాడులతో అటవీజనం భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మంగళవారం రాత్రి జంట ఏనుగులు ననియాలతండా సమీప పొలాలు, తోటలపై దాడులు చేశాయి. వరి, రాగి, టమోటా పంటల్లో తిరుగుతూ ధ్వంసం చేశాయి. ఓ రైతుకు చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. ఏనుగులు ప్రతి రాత్రి పొలాలవైపు వస్తుండటంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. జంట ఏనుగులు ననియాలతండా సమీపంలోని కూటల్లవంకల్లో ఉన్నట్లు తెలిపారు. అవి ననియాల, ననియాలతండా, నారాయణపురంతండా, రామాపురంతండా, జీడిమాకులపల్లె గ్రామాల సమీపంలో పొలాలు, తోటల్లో ప్రవేశించే అవకాశాలున్నాయని .. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఏనుగులు, పొలాలు, గ్రామాల వైపు వస్తే వెంటనే ఫోన్‌నంబర్లు 919668651, 6301667521 లకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు.

పాళెంలో ఒంటరి ఏనుగు దాడి



ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన ట్రాక్టర్

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కోటబావి మీదుగా పాళెం వద్దకు చేరుకొంది. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ మామిడితోటలోకి ప్రవేశించిన ఒంటరి ఏనుగు మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. కుక్కలు ఒక్కసారిగా మొరగడంతో అక్కడి నుంచి ఒంటరి ఏనుగు జూపల్లి వద్దకు చేరుకొంది. కల్లూరులోని పలువురుకి అక్కడి నుంచి ఆంజనేయస్వామి గుడి మీదుగా కోటపల్లి గ్రామంలోకి చేరుకొని ఇంటి ముందు ఉంచిన గోపికి చెందిన ట్రాక్టర్‌ను ధ్వంసం చేసింది. అనంతరం మార్గంలోని రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. బుధవారం పగలంతా అడవిలోని సూరప్ప చెరువు వద్ద సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

తూపిలిపాళెం తీరంలో రుద్రాభిషేక పూజలు





తూపిలిపాళెం తీరంలో మట్టితో శివలింగాలను ఏర్పాటు చేస్తున్న భక్తులు - ఇసుకతో చేసిన శివలింగానికి పూజలు

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్ర తీరంలో కార్తీక మాసం చివరి అమావాస్యను పురస్కరించుకొని బుధవారం శివుడికి రుద్రాభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం భీమేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కుందర్తి సుధాకర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మట్టితో శివలింగాన్ని ఏర్పాటు చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు సముద్రస్నానాలు ఆచరించారు. ఇసుకతో శివలింగాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. సముద్రతీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగం వద్దకు చేరుకొని దోష నివారణ, అమావాస్య పూజలు నిర్వహించారు. సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఎస్ఐ నాగ బాబు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగుల సేవాసంఘం నేతలు

తిరుపతి(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (ఐఈ) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఇంటర్ ఉద్యోగుల సేవా సంఘం నాయకులు ఐఈ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి రంజిత్‌బాషాను కోరారు. బుధవారం సంఘం నాయకులు రాష్ట్ర రాజధానిలో డైరెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు అవ్వారు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ రాంబాబు ఉన్నారు.

నేడు, రేపు డీఆర్‌ఎం పర్యటన

తిరుపతి(సెంట్రల్), నవంబరు19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుపతికి వస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఉదయం గుంతకల్లులో బయలుదేరి 11 గంటలకు రేణిగుంటకు చేరుకుంటారని, సీఆర్‌ఎస్‌లో అధికారులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేస్తారని తెలిపారు. జాతీయ భాషకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రోడ్లను బాగు చేయండి

● కమిషనర్‌ను కోరిన చెన్నారెడ్డికాలనీ వాసులు

తిరుపతి, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : వర్షాలతో రోడ్లు చాలా వరకు పాడైపోయాయని, బాగు చేయాలని 39వ డివిజన్ కార్పొరేటర్ పునీత, ప్రజలు కమిషనర్ మౌర్యను కోరారు. పాడైపోయిన రోడ్లను మరమ్మతులు చేయిస్తామని, గుంతలను వెంటనే పూడ్చాలని ఆమె అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని చెన్నారెడ్డి కాలనీలో బుధవారం కార్పొరేటర్ పునీత, అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేయాలని ఆదేశించారు. చెత్త సేకరణ వాహనం ప్రతిరోజూ వస్తోందా లేదా అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు వెంకటప్రసాద్, శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

ప్రధానికి ఎమ్మెల్యే స్వాగతం

● పవన్‌తోనూ భేటీ



ప్రధానికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి - పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యే దంపతులు

తిరుపతి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు బుధవారం ఉదయం పుట్టపర్తికి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి అక్కడి విమానాశ్రయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలసి సాయిబాబా మహా సమాధిని దర్శించుకున్నారు. సత్యసాయి మందిరంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యే దంపతులు భేటీ అయ్యారు. తిరుపతి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రేటర్ తిరుపతికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంపై చర్చించారు.

ప్రవీణ్‌కు సకలకళా వల్లభ అవార్డు ప్రదానం



తిరుపతి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సినీ నిర్మాత వై.ప్రవీణ్ సకలకళ వల్లభ అవార్డు అందు కున్నారు. విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం రాత్రి జరిగిన అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 25వ వార్షికోత్సవం(సిల్వర్‌జూబ్లి)లో న్యాయమూర్తి దేవ్ నరసింహారావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్‌వీఎస్ఎన్.కుమార్, వేదాంతం రామలింగశాస్త్రి చేతుల మీదుగా తీసుకున్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మల్లికార్జున తదితరులు

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఎన్ఎస్‌యూఐ ఘన నివాళి అర్పించింది. ఎస్వీయూ ప్రకాశం భవన్‌లో ఏర్పాటు చేసిన జయంతి సభలో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. మల్లికార్జున మాట్లాడుతూ దేశానికి తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించారన్నారు. నిరుపేదల కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి ఆమె కృషి చేశారని కొనియాడారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తే అన్ని వర్గాల సంక్షేమానికి మార్గం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివబాలాజీ, మన్సూర్ పాల్గొన్నారు.

అమ్మవారికి పద్మశాలీల సారె



తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి జిల్లా పద్మశాలి సంఘం, వివిధ ప్రాంతాల పద్మశాలీలు బుధవారం పట్టువస్త్రాలతో సారె సమర్పించారు. ఏటా వీరు అమ్మవారికి సారె సమర్పిస్తున్నారు. అమ్మవారి పుష్కరిణి నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకోగా, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ అధికారులకు పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్మోహన్, ఎస్వీ ప్రసాద్, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక వాసి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పారిస్ హోటల్లో కర్ణాటకకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం తుముకూరుకు చెందిన సతీష్(48) శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు వచ్చాడు. దర్శనం చేసుకుని తిరిగి తిరుపతికి చేరుకున్నాడు. పారిస్ హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. బుధవారం రూములోని ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు. లాడ్జి మేనేజర్ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హేమాద్రి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అతని భార్య యమున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత, కుటుంబ అవసరాల నిమిత్తం ఆయన కొంతమేర అప్పులు చేసినట్లు తెలుస్తోంది.

భక్తిశ్రద్ధలతో కన్నెపూజ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైరాగిపట్టెడ హథీరాంజీ కాలనీలో బుధవారం అయ్యప్ప స్వాముల కన్నెపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప భక్తులు పడికట్ల పూజ నిర్వహించి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక కన్నెపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి పాటలతో భజన చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

గొడుగుల వితరణ



తిరుచానూరు, నవంబరు 19((ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి తమిళనాడుకు చెందిన గోపాల్ ఐదు గొడుగులను అందజేశారు. డిప్యూటీ ఈవోకు హరీందర్‌నాథ్ వీటిని స్వీకరించారు.

చెత్త కుప్పల్లో చైతన్య రథం

● ఐదేళ్లుగా పక్కనపడేసిన వైనం
● తుప్పుపడుతున్నా పట్టించుకోని అటవీ అధికారులు



అటవీ శాఖ కార్యాలయంలో తుప్పు పడుతున్న వన చైతన్యరథం

మంగళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించేందుకు, వన్యప్రాణులను కాపాడటంలో ప్రజలను చైతన్యపరచడానికి ఉపయోగించే వనచైతన్య రథం ఐదేళ్లుగా మూలనపడి ఉంది. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటయిన తర్వాత శేషాచల కొండలకు ఆనుకుని ఉన్న అటవీ గ్రామాల్లో వన్యప్రాణులను వేటాడటం, ఎర్రచందనం వృక్షాలను నరికి రవాణా చేయడం, అడవులకు నిప్పు పెట్టడం వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం దీన్ని తీసుకొచ్చారు. ప్రారంభంలో కొన్ని రోజుల పాటు అటవీ సమీప, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. తర్వాత ఏమైందో ఏమో గాని ఐదేళ్లుగా దీన్ని పక్కన పెట్టేశారు. తిరుపతి కపిలతీర్థం వద్ద ఉన్న యాంటీ పోచింగ్ అటవీ శాఖ కార్యాలయం వద్ద ఐదేళ్లుగా వాడకుండా పెట్టేయడంతో తుప్పుపడుతోంది. డీజిల్ ఖర్చులు, డ్రైవర్ జీతం, ఇతర ప్రచార సామగ్రికి అవసరమైన నిధులు లేకపోవడం వల్లే పక్కన పెట్టాల్సి వచ్చిందని అధికారులు అంటున్నారు. కొన్ని రోజుల క్రితం తిరుపతి పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఎర్రచందనం గోదామును పరిశీలించిన సమయంలో అధికారులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు ప్రయత్నించాలని పలువురు సూచిస్తున్నారు.

బహిరంగ మలమూత్ర విసర్జనను అరికడదాం

● వరల్డ్ టాయిలెట్ డేలో కమిషనర్ మౌర్య



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ మౌర్య, అధికారులు

తిరుపతి, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : నగరంలో బహిరంగ మలమూత్ర విసర్జన జరగకుండా పలుచోట్ల మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని, ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఇక్కడికి విచ్చేసే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం 52టాయిలెట్లను 40 ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. వాటి నిర్వహణ బాధ్యతను సులభ ఇంటర్నేషనల్ సంస్థ, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించామన్నారు. ప్రజలు, భక్తుల సౌకర్యార్థం మరిన్ని నిర్మించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజనీర్ తులసికుమార్, రెవెన్యూ ఆఫీసర్ రవి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

రాస్ ప్రత్యేక టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి(రాస్) అధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు తెలిపారు. తిరుపతి, అనంతపురం, చిత్తూరు, కడప, తిరుత్తణి ప్రాంతాల్లోని ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. అభ్యర్థులకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) గుర్తింపు ఉండాలని పేర్కొన్నారు. పది రోజుల్లోపు ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ సేవా సమితి (రాస్), అన్నమయ్య మార్గ్, తిరుపతి. చిరునామాకు దరఖాస్తులు పంపాలని, పూర్తి వివరాలకు 0877-2242404కు సంప్రదిం చాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



శ్రీనివాసులు

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కెమికల్ ఇంజినీరింగ్ పరిశోధకులు జి.శ్రీనివాసులు డాక్టరేట్ పొందారు. మాస్ ట్రాన్స్‌ఫర్ స్టడీస్ ఇన్ త్రీ ఫేజ్ ఫ్లూడిజ్డ్ బబెడ్ బయోరియాక్టర్ అంశంపై ప్రొఫెసర్ శ్రీనాథ్‌బాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

రాష్ట్ర సంఘం దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు



మాధవరావుతో జిల్లా ప్రతినిధులు

తిరుపతి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ప్రతినిధులు రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.మాధవరావు అధ్యక్షతన విజయవాడ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో హాజరైన జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థ రద్దయిన తర్వాత కూడా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రెండు నెలలుగా కమిషన్ అందలేదని, ఐసీడీఎస్ ఎండీఎం కమిషన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, 65 ఏళ్ల దాటిన వారికి డోర్ డెలివరీ చేయకలేకపోతున్నామని, ఎంఎల్ఎస్ పాయింట్ల తరుగుదల వంటి సమస్యలను ప్రస్తావించారు. ఈ సమావేశంలో తిరుపతి అర్బన్ రేషన్ డీలర్స్ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు కోటేశ్వరనాయుడు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

మందుల వాడకంలో డాక్టర్ల సూచనలు తప్పనిసరి



అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి జబ్బులకైనా డాక్టర్ల సూచనల మేరకే మందులు వాడాలని, లేనిపక్షంలో ఏఎంఆర్ అనే వ్యాధి బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవర్నేస్ వీక్‌లో భాగంగా ఆయన బుధవారం స్థానిక జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి ఏఎంఆర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సొంత వైద్యం సురక్షితం కాదన్నారు. అందుబాటులో ఉన్న డాక్టర్లను సంప్రదించి వారి సూచనల మేరకు మాత్రమే మందులు వాడటం సురక్షితమన్నారు. అనంతరం ఏఎంఆర్‌పై అవగాహన కల్పిస్తూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు అభిష్న, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలను స్మరించుకోవాలి



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి కృషి చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత యార్లపల్లి గోపి అన్నారు. ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను బుధవారం స్థానిక సంజయ్‌గాంధీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్థానికులకు పంచి పెట్టారు. అలాగే కాంగ్రెస్ నగరాధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో 25 టన్నుల పూలతో అలంకరణ

● ఉద్యావన శాఖ డీడీ శ్రీనివాసులు వెల్లడి

తిరుచానూరు, నవంబరు 19((ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి తరహాలో తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో 25 టన్నుల పూలతో పాటు ఫలాలతో ఆలయంలో అలంకరణ చేశామని టీటీడీ ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆలయంలో ధ్వజస్తంభం, అంతర్యాగం, ఆస్థాన మండపం, పంచమీతీర్థ మండపం, ఫ్రైడే గార్డెన్‌లో అలంకరణకు వివిధ రాష్ట్రాల నుంచి పూలను తెప్పించామన్నారు. సంప్రదాయ పుష్పాలైన చామంతి, బంతి, గులాబీలకే ప్రాధాన్యమిచ్చామని చెప్పారు. సీజనల్ ఫ్లవర్స్ 25 వేలు, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నామని తెలిపారు. పుష్పయాగం వినియోగానికి ఐదు టన్నుల పూలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో మొదటి రోజు, నాలుగు, ఏడు రోజుల్లో అలంకరణలు మారుస్తామని వివరించారు. స్నపన తిరుమంజనం జరుగుతున్న శ్రీకృష్ణ ముఖ మండపాన్ని సంప్రదాయ ఫల, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించామని ఆయన చెప్పారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

● ఘనంగా వెటర్నరీ కళాశాల హాస్టల్ డే



విద్యార్థులతో వీసీ జేవీరమణ పక్కన రిజిస్ట్రార్ వినూ, డీఎస్ఏ వైకుంఠరావు, ఏడీ జగపతిరామయ్య తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలనూ పెంచుకోవాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ జేవీరమణ తెలిపారు. వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం ట్రియాంజ్-2కే25 పేరిట హాస్టల్ డేని ఘనంగా నిర్వహించారు. వీసీతో కలిసి రిజిస్ట్రార్ ఆర్.వినూ, డీఎస్ఏ వి.వైకుంఠరావు, అసోసియేట్ డీన్ పి.జగపతిరామయ్య మాట్లాడారు. దేశ, విదేశాల్లో వెటర్నరీ విద్యార్థులకు మంచి డిమాండ్ ఉందని, విద్యాపరంగా సరైన ప్రణాళికను రూపొందించుకుని ఆచరించాలని అన్నారు. కళాశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న వసతిగృహాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వార్డెన్లు డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ కె.లక్ష్మీకవిత, అడిషనల్ వార్డెన్లు డాక్టర్ ఇ.తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎం.శ్రవంతి పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు అదరహో..: హాస్టల్‌డేని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పల్లెపదాలు, శాస్త్రీయ, సంగీత, సినీ పాటలకు నృత్యాలు చేసి అదరహో అనిపించారు. విద్యార్థుల ఈలలు, కేరింతలతో ఆడిటోరియం హోరెత్తింది.





అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తమిళనాడులోని వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళి వెంకటసుబ్బు తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి విరాళం డీడీని అందజేశారు.

తిరుమలలో పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్



తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి డిప్యూటీస్పీకర్ రాజవేలు బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

→ రాజవేలు


విద్యాశ్రీషతీర్థ స్వామికి పెద్ద మర్యాద



టీటీడీ పెద్ద మర్యాదతో వ్యాసరాయ మఠాధిపతి విద్యాశ్రీషతీర్థ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అర్చక బృందంతో కలిసి ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకిలో తీసుకెళ్లిన శఠగోపాన్ని అందుకున్న అనంతరం స్వామిజీ మంగళవాయిద్యాలతో తన శిష్యబృందంతో కలిసి ఆలయంలోకి వెళ్లారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,966

తలనీలాలు సమర్పించినవారు: 21,535

సాంస్కృతిక వైభవం





భారతదేశం అంటే విభిన్న సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు. దేశంలో ఏ మూలకు వెళ్లినా ఏదో కొత్త సంస్కృతి మనల్ని పలకరిస్తుంది. పదుల సంఖ్యలో విభిన్న సంస్కృతులు ఒకే చోట చూసేందుకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వేదికగా నిలుస్తున్నాయి. ఆయా వాహనాల ముందు దేశ నలుమూలల నుంచి వచ్చిన కళాబృందాల ప్రదర్శనలు భక్తుల మనసును దోచుకుంటున్నాయి. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 15 కళా బృందాలు ఉదయం, రాత్రి అమ్మవారి వాహన సేవల ముందు చేస్తున్న కళారాధన భక్తులను ఆకట్టుకుంటోంది. ఒక పూటకు సుమారు 500మంది కళాకారులు వాహన సేవలో పాల్గొంటారు. ఏపీ నుంచి కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, మహారాష్ట్ర నుంచి పాండురంగ నృత్యం, కేరళ నుంచి డ్రమ్స్, మణిపూర్ సాంప్రదాయ నృత్యాలు అమ్మవారి వాహనసేవలో కళారాధన చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ యేడాది తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ, గిరిజన తెగలు, ఆదివాసీలు పండుగ పబ్బాల్లో చేసే గుస్సాడీ, లంబాడీ, కోయ, గోండు నృత్యాలు జానపద కళా రూపాలను ప్రతిబింబిస్తున్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



'సివిల్స్' ఉచిత కోచింగ్‌కు
దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్ష-2026కు సంబంధించి ఉచిత కోచింగ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు అత్యుత్తమ కోచింగ్, పుస్తకాలు, భోజనం, వసతి ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటికోసం ఈ నెల 26వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఘాట్‌రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామికి
ప్రత్యేకాభిషేకం



భక్తులకు అన్నప్రసాదం పెడుతున్న అదనపు ఈవో

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అలిపిరి కాలినడకమార్గంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీవారి ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంను అదనపు ఈవో సన్మానించారు.

ర్యాపిడో పేరుచెప్పి బైకులో తీసుకెళ్లి

- భక్తుడిపై మందుబాబుల దాడి
- మెడలో ఉన్న గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో.. అంటూ బైకులో ఎక్కించుకున్నాడు. దూరంగా పొదల్లోకి తీసుకెళ్లి మరికొందరు మందబాబులతో కలిసి ఆ భక్తుడిపై దాడిచేసి బంగారు గొలుసు లాక్కెళ్లారు. తిరుపతిలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అలిపిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీకాకుళంకు చెందిన శ్రీధర్, నెల్లూరు వైఎస్‌ఆర్ కాలనీలో ఉంటున్న ఓ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనం కోసం రెండు రోజుల క్రితం తిరుమలకు వచ్చారు. అక్కడ దర్శనం చేసుకుని ఉపాధ్యాయనగర్‌లో రూము అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత నెల్లూరుకు చెందిన భక్తులు వెళ్లిపోయారు. శ్రీధర్ మాత్రం రైల్వే స్టేషన్‌కు వెళ్ళడానికి ఉపాధ్యాయ నగర్‌లోని బస్టాపు వద్ద నిలబడి ఉన్నారు. ఇతడిని గమనించిన ఓ వ్యక్తి రాపిడో పేరుతో మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకున్నాడు. కొంతదూరంలోని ముళ్లపొదల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మద్యం తాగుతున్న తన స్నేహితులతో కలిసి శ్రీధర్‌పై దాడి చేశారు. అతడి మెడలో వున్న దాదాపు నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుడి కేకలతో స్థానికులు వచ్చారు. వీరిచ్చిన సమాచారంతో అలిపిరి ఎస్‌ఐ లోకేష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఐదుగురు పరారయ్యారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.



సమాపనోత్సవంలో పాల్గొన్న పద్మావతి, ద్రవిడ యూనివర్సిటీల వీసీలు ఉమ, దొరస్వామి తదితరులు

- సామాన్య ప్రజల చెంతకు

పుస్తక విజ్ఞానాన్ని చేర్చాలి

లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో వక్తల మనోభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుస్తక విజ్ఞానాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత గ్రంథాలయాలపై ఉందని పలువురు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రంథాలయాల పాత్ర'పై మూడు రోజులుగా ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో చేపట్టిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) సలహాదారు డాక్టర్ జగదీష్ అరోరా మాట్లాడుతూ.. కాలానుగుణంగా గ్రంథాలయాలను సాంకేతికరించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు తమవంతు పాత్రను పోషించాలని కోరారు. శిథిలమవుతున్న పుస్తకాలను డిజిటలైజ్ చేయాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ వెన్నం ఉమ కోరారు. తద్వారా ఆయా పుస్తకాల్లోని విలువైన విజ్ఞానాన్ని భవిష్యత్తుతరాలకు అందించాలన్నారు. ఎస్వీయూ రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. లైబ్రరీ సైన్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో పురోగతిని సాధించిందన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో చదువుకున్న వారు ప్రస్తుతం దేశ, విదేశాల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నారన్నారు. ఇన్‌ఫ్లిబ్‌నెట్ జాయింట్ కన్వీనర్ రాజా మాట్లాడుతూ.. విజ్ఞానానికి సాంకేతికతను జోడించాలని సూచించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ సేవుకన్ మాట్లాడుతూ.. పరిశోధనల్లో ప్రమాణాలను పెంచడానికి గ్రంథాలయాలు తోడ్పడాలని కోరారు. అంతర్జాతీయ సదస్సు విజయవంతానికి సహకరించిన వారికి సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ సురేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచీ హాజరై పేపర్, పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్ చేసిన ప్రతినిధులను అభినందించారు. దేశ, విదేశీ ప్రతినిధులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు.

సదస్సు తీర్మానాలివే..

- 2047 నాటికి జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడానికి జాతీయ గ్రంథాలయ విధానాన్ని రూపొందించాలి.
- గ్రంథాలయ అధికారులు, సిబ్బందికి ఇన్-సర్వీస్ శిక్షణను అందించాలి.
- లైబ్రరీ సైన్స్ ఇంటర్న్‌షిప్‌ను క్రమబద్ధంగా నిర్వహించి విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి.
- లైబ్రరీ సైన్స్ పాఠ్యాంశాల్లో మార్పు చేర్పులు చేపట్టాలి.
- పీజీ స్థాయిలో అన్ని సబ్జెక్టుల్లో లైబ్రరీ సైన్స్ పేపర్ పెట్టాలి.
- గ్రంథాలయ పరిశోధన మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.
- ప్లాగరిజంపై అవగాహన పెంచడానికి లైబ్రేరియన్లు-లైబ్రరీసైన్స్ విభాగాలకు ఓరియెంటేషన్ నిర్వహించాలి.
- ఉచితంగా లభించే ప్రచురణలు, స్వయం వంటి ఓపెన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాలి.



ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సమీపంలో బోదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసుల తనిఖీల్లో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టుచేసి 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. ఆర్‌ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్‌ఐలు వినోద్‌కుమార్, లింగాధర్ బృందాలు బుధవారం తెల్లవారుజామున కడివేడు ఫారెస్టు బీట్ పరిధిలోని బోదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వస్తున్న కారు.. పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. అందులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.పట్టుబడ్డ స్మగ్లర్లను, దుంగలతో సహా కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుగా మారి.. నాట్లేసి

కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తదితరులు బుధవారం పెళ్లకూరు మండలం దిగువ చావాలి గ్రామం వద్ద పొలాల్లో వరినాట్లు వేసి కర్షకుల్లో నూతనోత్సాహం నింపారు. నాయుడుపేటలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యంలో దిగువ చావాలి గ్రామం వద్ద ఆగారు. పొలాల్లో కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. రైతులు, కూలీలతో మాట్లాడారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నట్లు రైతులు తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలిస్తూ అధిక దిగుబడులు పొందేలా పని చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులిచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి



వరినాట్లు వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

జీవాలు, నాటుకోళ్ల పెంపకంతో రెట్టింపు ఆదాయం

- వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పాడి, పాల ఉత్పత్తుల తయారీ, జీవాలు, నాటుకోళ్ల పెంపకాన్ని చేపట్టడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి పెంపకం, విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీ, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, పోషణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ లైవ్ స్ట్రీమింగ్ ప్రోగ్రామ్‌ను రైతులు వీక్షించే ఏర్పాట్లు చేశారు. వెటర్నరీ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీఈ బి.శోభామణి, డెయిరీ టెక్నాలజీ అసోసియేట్ డీన్ జి.గంగరాజు, సీసీ వీఈసీ కోఆర్డినేటర్ కె.సుజాత, వివిధ విభాగాల అధ్యాపకులు, రూరల్ మండల వెలుగు ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

వినియోగంలో లేని బ్యాంకు ఖాతాల నుంచి
మీ నగదు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లగా బ్యాంకు ఖాతాల్లో ఏ విధమైన ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఉన్న మీ నగదును తిరిగి పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. 'మీ డబ్బు- మీ హక్కు' గోడపత్రికలను గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మీ డబ్బు మీ హక్కు అనేనినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రజలుతమ పేర్ల మీద ఉన్న ఖాతాల్లో పదేళ్లగా లావాదేవీలు జరపని నగదును పొందని ఎడల ధృవీకకరణపత్రాలు తీసుకుని మీ నగదు, ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం రిజర్వు బ్యాంకు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో గడచిన పదేళ్లగా ఎలాంటిఆర్థిక లావాదేవీలు జరపకుండా 5,50,632ఖాతాలోల రూ.112.42కోట్లు నిల్వ ఉంద్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరురవికుమార్, మధుసూదన్, చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రైతును అన్ని విధాలా ఆదుకుంటాం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు టౌన్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి):రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేర యూరియా విడతల వారీగా అందిస్తామన్నారు. రాయితీపై ఎరువులు, విత్తనాలు వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బ తిన్న పంటలకు పరిహారం అందిస్తామన్నారు. రైతు రథం పథకం కింద మండలానికి 30 ట్రాక్టులు అందిస్తామన్నారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, ఏఎంసీ చైర్మన్ డి.ఎస్.గణేష్; మాజీ ఎంపీపీ డీఎన్ ఎలుమలై, జడ్పిటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, బాలాజీ, కరుణాయాదవ్, పుత్తూరు వ్యవసాయ ఏడీ శ్రీలక్ష్మి, ఏవోలు కోదండయ్య, విజయకుమార్, హెచ్‌వో వెంకటసౌజన్య, ఎంపీడీవో పద్మావతి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాతావరణ పరిస్థితులు గుర్తించే ఆటోమేటిక్ యంత్రం ఏర్పాటు



పుత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకునే ఆటోమేటిక్ యంత్రాన్ని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రాజశేఖర్ బుధవారం పుత్తూరు సబ్‌స్టేషన్‌లో అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ యంత్రం వర్షపాతం, ఉష్ణోగ్రత, వాతావరణ పీడనాలను గుర్తించి విజయవాడ కేంద్రానికి పంపుతుందన్నారు. పుత్తూరు, నారాయణవనం ఏఎస్వోలు మునికృష్ణయ్య, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక



పుత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ 14 నెట్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత తమిళ పాఠశాల కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనారని ప్రధానోపాధ్యాయురాలు స్వరూప తెలిపారు. బాలుర విభాగంలో 9వ తరగతి చదువుతున్న గిరీష్, బాలికల విభాగంలో చారులత, ఢిల్లీరాణిలు వున్నారని అన్నారు. వీరందరూ ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం ఆచారి, గోపికృష్ణలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మానసికొల్లాసానికి మహిళలు ఆసక్తి కలిగిన పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి మీనాకుమారి కోరారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పనులు పూర్తి చేసుకుని మహిళా పాఠకులు గ్రంథాలయాలకు రావాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

పుత్తూరు టౌన్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గేటు పుత్తూరులో రాస్ ఆధ్వర్యంలో రాస్ పొదుపు సంఘ సభ్యులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం టాటా ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో క్యాన్సర్‌పై మధుమేహం, రక్తపోటు, గర్భాశయ ముఖద్వార, నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ వైద్యులు వెంకయ్య బాబు, హేమంత్ కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది వేదాచలం, బాలకృష్ణ, మునిరత్నమ్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకే అన్నదాత సుఖీభవ

ఎమ్మెల్యే ఆదిమూలం



రైతులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సత్యవేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. సత్యవేడులో అగ్రి ల్యాబ్ భవనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మెగా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాగులో ఆధునిక, సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని 29,653 మంది రైతులకు సంబంధించి రూ.20,23,37000 మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం అక్కడి నుంచి సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కళాశాలలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కంప్యూటర్ విద్యకు అధ్యాపకులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు విన్నవించారు. అక్కడి నుంచి వీఆర్‌కండ్రిగకు చేరుకుని సత్యవేడు-ఊత్తుకోట మార్గంలోని కల్వర్టును పరిశీలించారు. వంతెన దుస్థితిని ఆర్అండ్‌బీ అధికారులకు వివరించి త్వరగా కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళి, తహసీల్దార్ రాజశేఖర్, ఏఎస్‌వో త్రివిక్రమరావు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరుల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు పైపైకి...!

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో కోడి మాంసం, గుడ్ల ధరలు తగ్గాల్సి ఉండగా... రోజు రోజుకు పెరుగుతుండటంతో మాంసాహారులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో డిసెంబరు నెలాఖరు వరకు అయ్యప్ప భక్తులు మాలలు ధరిస్తారు. అలాగే కార్తీక మాసం కావడంతో మహిళా భక్తులు మాంసాహారాన్ని ముట్టరు. ఈ నేపథ్యంలో ఏటా అక్టోబరు రెండో వారం నుంచి డిసెంబరు నెలాఖరు వరకు కోడిమాంసం, కోళ్లు, కోడిగుడ్లు, పొట్టేళ్ల మాసం విక్రయాలు తగ్గుతుంటాయి. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా నవంబరు మొదటి వారం వరకు కోడిగుడ్డు ధర రూ.5.50 ఉండగా, ప్రస్తుతం రూ.7 పలుకుతోంది. అదే విధంగా బ్రాయిలర్ కోడి మాంసం కిలో రూ.180 నుంచి రూ.200 ఉండగా, ప్రస్తుతం రూ.260నుంచి రూ.280 వరకు పలుకుతోంది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కార్తీక పూజలు

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయదుర్గాదేవి ఉపపీఠంలో బుధవారం కార్తీకమాసం సందర్భంగా నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్తీక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశిష్టపూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



కార్తీకదీప పూజల్లో భక్తులు

రహదారి పక్కనే చెత్త

- దుర్వాసనతో వాహనదారుల ఇబ్బందులు
- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని వైనం

తడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తుంటే గ్రామస్థాయిలో మాత్రం పారిశుధ్యం అధ్వానంగా ఉంది. స్థానిక బోడిలింగాలపాడు శివాలయానికి సమీపంలో జాతీయ రహదారి పైనే చెత్త వేస్తున్నారు. ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఇదే దారిలో వెళ్తూ జాతీయ రహదారిపై చెత్త వెయ్యకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అప్పట్లో పంచాయతీ అధికారులు సుమారు లక్ష రూపాయలు ఖర్చుచేసి ఆ చెత్తను కొంతమేర తొలగించారు. అక్కడ ఎవరూ చెత్త వెయ్యకుండా ఇనుప రేకులు ఏర్పాటు చేశారు. అక్కడ చెత్త పారవేసే వారిని గుర్తించి జరిమానా కూడా విధించారు. అయితే అదంతా మూన్నాళ్ల ముచ్చటగా సాగింది. మూడు నెలల నుంచి అక్కడ చెత్త వేయడం మొదలుపెట్టారు. పరిశ్రమలు, హోటళ్ల చెత్తను తీసుకువచ్చి పడేస్తుండటంతో జాతీయ రహదారిపైకి వచ్చేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారి పక్కన చెత్త వెయ్యకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

దేశ ఆర్థికాభివృద్ధికి రైతే వెన్నెముక: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధికి రైతే వెన్నెముక అని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని రైతులకు రెండో విడత నగదు జమ చెక్కులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థిక బలం చేకూర్చడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గ పరిధిలోని 22,217 మంది రైతులకు రూ.14.80 కోట్లు నగదును వారి ఖాతాల్లో జమ కావడంతో వారికి చెక్కు అందజేయడం జరిగిందన్నారు. రైతులకు సాగు ఖర్చులకు సాయం అందించడానికి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాలు ఎంతో దోహదపడతాయన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, తహసీల్దారు ప్రసాద్, టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, పట్టాభిరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలా వతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, బిల్లు చెంచురామయ్య, దువ్వూరు రాజ శేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జలీల్‌ఆహ్మద్, వాటంబేడు హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పోటుపాళెంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పొలాల్లో ట్రాక్టర్‌తో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు.

తూపిలిపాళెం తీరంలో రుద్రాభిషేక పూజలు





తూపిలిపాళెం తీరంలో మట్టితో శివలింగాలను ఏర్పాటు చేస్తున్న భక్తులు - ఇసుకతో చేసిన శివలింగానికి పూజలు

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్ర తీరంలో కార్తీక మాసం చివరి అమావాస్యను పురస్కరించుకొని బుధవారం శివుడికి రుద్రాభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం భీమేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కుందర్తి సుధాకర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మట్టితో శివలింగాన్ని ఏర్పాటు చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు సముద్రస్నానాలు ఆచరించారు. ఇసుకతో శివలింగాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. సముద్రతీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగం వద్దకు చేరుకొని దోష నివారణ, అమావాస్య పూజలు నిర్వహించారు. సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

ప్రతి ఉద్యోగి నిబద్ధతతో లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ చంద్రశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ అన్నారు. నాయుడుపేట విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ అంతరాయాలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. లూజ్ లైన్స్ సరిచేయడం, చెట్ల కొమ్మలను తొలగించడం వంటివి పనులను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్దరణలో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే రెవెన్యూ వసూళ్లను వేగవంతంగా చేయాలని సూచించారు. ప్రతి ఒక్క అధికారి క్రమశిక్షణ, బాధ్యతతో వ్యవహరిస్తే కిందస్థాయి సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వరప్రసాద్‌రెడ్డి, శేఖర్, శీనయ్య, ఏఏఈ శ్రీలత, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్, మురళి, జగదీష్, అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

కాళంగి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం వద్ద కాళంగి రిజర్వాయర్ గేట్లును ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో సూళ్లూరుపేట కాళంగి నది పరివాహక ప్రాంతాలైన వట్రపాలెం తదితర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడు వట్రపాలెం, పడమటి కండ్రిగ ప్రాంతాల్లో పర్యటించారు. కాళంగి నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ అవసరమొచ్చినా వెంటనే మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

బంగారు భవితకు బాటలు

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మహిళలు తమ కుటుంబాల బంగారు భవితకు బాటలు వేసుకోవాలని వెలుగు ఏపీఎం అనీల అన్నారు. మండల పరిధిలోని గూడలి-1 సంఘ బంధంలో బుధవారం సంఘ బంధం అధ్యక్షులు, పొదుపు సంఘాల లీడర్లకు జీవనోపాధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి మహిళ తమ కుటుంబం ఆర్థికంగా, ఆరోగ్యంగా, విద్య, వైద్యంలో ముందు ఉండాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోవాలన్నారు. సమావేశంలో అకౌంటెంట్ బిందు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో బుధవారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉల్లా కస్తూరయ్య యాదవ్, మద్దూరు ఫరూక్‌జోయల్, కనుపూరు జగదీష్, కోటేశ్వరరావు, మునిచంద్ర పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జయంతి

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదప్రజల అభ్యున్నతి కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎనలేని కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, రామకృష్ణారావు, వేమయ్య, సుబ్బరామరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈయూ ఆధ్వర్యంలో పురుషుల దినోత్సవం

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. డిపో ఆవరణలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరాజు, విజయ్ కుమార్, కేసీరాజు, జిలానీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: రైతుకు తీవ్ర గాయాలు

బాలాయపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దుక్కి దున్నుతూ ట్రాక్టర్ బోల్తా పడి రైతుకు గాయాలైన ఘటన బుధవారం మండలంలోని అంబలపూడి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన సముద్రాల చంద్రయ్య సమీపంలోని పొలాల్లో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. అదును దుక్కి చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ట్రాక్టర్ కింద ఇరుక్కున్న చంద్రయ్యను స్థానికులు గంటన్నర పాటు శ్రమించి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పతికి తరలించారు.

ఆక్రమణలను అడ్డుకోండి

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని, అధికారులు ఆక్రమణలను అడ్డుకోవాలని పూర్వ విద్యార్థులు అన్నారు. కళాశాలకు చెందిన ఖాళీ భూములను కొందరు ఆక్రమించి విక్రయాలు సాగిస్తున్నారని, అధికారులు స్పందించి కళాశాల స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

రైతులకు అవగాహన

వెంకటగిరి, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులకు ఉద్యాన, వరి పంటల సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, మెలకువలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మహిళా ఆర్థిక స్వావలంభన, ఉపాధి కల్పనకు చేపట్టవలసిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధిపతి డాక్టర్ శ్రీధర్, శాస్త్రవేత్తలు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన, రైతులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు క్రీడాపోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కరిమున్నీసా, హేమంత్, నవ్య, గణేష్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు, హాసిని యోగా పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, గాంధీ, చందన, కిరణ్మయి అభినందించారు.

కూటమి పాలనలో సస్యశ్యామలం: విజయశ్రీ

పెళ్లకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిగువ చావాలి గ్రామంలో టీడీపీ నాయకుడు నేలవల్లి సిద్దులయ్య నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పాల్గొన్నారు. సాగు పద్ధతులు, పంట దిగుబడులు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. నాట్లు వేసే దగ్గర నుంచి ధాన్యం నూర్పిడి వరకు రైతులకు సూచనలు, సలహాలు అందించాలని వ్యవసాయశాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మన శ్రీధర్, పీఏసీఎస్ అధ్యక్షుడు కేవీనాయుడు, నాయకులు పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, సత్యంరాజు, ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉదయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయిప్రసాద్

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల్లో భాగంగా తాగునీరు, రహదారులు, పర్యా వరణం, పరిశుభ్రత, పచ్చదనం వంటి వనరులు సమకూర్చేలా పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడిచెత్తతో ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఈవోపీఆర్‌డీ సురేష్‌బాబు, ఏపీవో విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయిని ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ఝాన్సీలక్ష్మీబాయి ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, నిరంజన్‌రెడ్డి, శివ చరణ్, కీర్తన, మేఘన, సింధు, హాసిని తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ



క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ గురించి వివరిస్తున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీపీ గడ్డం అరుణమ్మ, ఎంపీడీవో నారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం - పచ్చదనం పెంపొందించడానికి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో పాటు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు తెలిపారు. తిరుపతి, అనంతపురం, చిత్తూరు, కడప, తమిళనాడులోని తిరుత్తణి ప్రాంతాల్లోని ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో పనిచేయాల్సి ఉంటుందని, అభ్యర్థులకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉండాలన్నారు. పది రోజుల్లో ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ సేవా సమితి(రాస్), అన్నమయ్య మార్గ్, తిరుపతి. చిరునామాకు దరఖాస్తులు పంపాలని, వివరాలకు 0877-2242404కు సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎల్ఏపీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన నొవక్ ఆకాష్, నితేష్, సూర్యతేజ, భువనేష్‌మీనా ప్రతిభ చూపారని, ఈనెల 22 నుంచి 24 వరకు చంద్రగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా అష్టోత్తర కలశ పూజలు





శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అష్టోత్తర కలశ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ పూజలను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి దంపతులు, ఈవో బాపిరెడ్డి దంపతులు, పాలకమండలి సభ్యులు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బిల్వ పత్రాలు, కుంకుమ నిమజ్జనం



బిల్వ పత్రాలు, కుంకుమను నిమజ్జనం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బుధవారం బిల్వ పత్రాలు, కుంకుమ నిమజ్జనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో పదిరోజుల పాటు నిర్వహించిన లక్ష బిల్వ, కుంకుమ అర్చన పూజలు బుధవారంతో ముగిశాయి. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ బిల్వ పత్రాలు, కుంకుమను ఊరేగింపుగా స్వర్ణముఖి నది ఒడ్డుకు చేర్చారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలమండలి చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు, ప్రధాన అర్చకుడు కరుణాకరన్ గురుకుల్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో బుధవారం జిల్లాస్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 నెట్‌బాల్ పోటీలు పిచ్చాటూరులో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ముందస్తు అభినందనలు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు, తిరుపతి జిల్లా ఎస్‌ఎఫ్ సెక్రటరీ కిషోర్, ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, పీఈటీలు స్వర్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించండి



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులతో టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడా పోటీల్లో రాణించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని బీఎన్‌కండ్రిగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి కోరారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఏడు డివిజన్ల క్రీడాకారులు పోటీ పడగా, ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్రస్థాయి జట్లకి ఎంపిక చేశామని హెచ్‌ఎం రమణయ్య చెప్పారు. ఎంపికైన జట్లు ఈ నెల 22, 23, 24 తేదీల్లో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎస్‌ఐ హరిప్రసాద్, ఎంఈవో మునిసుబ్రమణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకరనాయుడు, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కిషోర్‌కుమార్, భార్గవి, పీడీలు మస్తానయ్య, హరి పాల్గొన్నారు.

కళత్తూరును మెరుగ్గా అభివృద్ధి చేస్తాం

500 మందికి గ్యాస్ స్టౌల పంపిణీ



గ్యాస్ స్టౌలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట తెగి ముంపుకు గురైన కళత్తూరును మునుపటికంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త శంకర్‌రెడ్డి చెప్పారు. లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు సాయిరాం అందించిన 500 గ్యాస్ స్టౌలను శంకర్‌రెడ్డి, టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చందన స్రవంతి, సురుటుపల్లి ఆలయ పాలకమండలి చైర్మన్ పద్మనాభరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపి, బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

రేణిగుంట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాస్ కె.వి.కెలో పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పచ్చదం, సుందరీకరణ సంస్థ చైర్‌పర్సన్ సుగుణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా వ్యవసాయ పెట్టుబడి కోసం సంవత్సరానికి మూడు విడతల్లో రూ. 21 వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెడ్ శ్రీనివాసులు, కె.వి.కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

రాష్ట్రీయ సేవా సమితి, మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మర్రిగుంటలో పశు వైద్య ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. దూడలకు, పశువులకు చికిత్సను అందించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె సిబ్బంది డాక్టర్ అనూష, రవి రామాంజులు, శంకరయ్య, జ్యోతి, స్వాతి, శైలజ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజాదర్బార్

నారాయణవనం, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నారాయణవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్‌ను ఈనెల 21న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని, వ్యక్తిగత, సామూహిక సమస్యల పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

27,847మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు: ఎమ్మెల్యే సుధీర్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

ఏర్పేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని బుధవారం జమ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రైతులతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కృషితో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. రెండో విడత పెట్టుబడి సాయం కింద 27,847మంది రైతులకు రూ.18.64కోట్లు బుధవారం జమ చేశామన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కిసాన్ డ్రోన్ కెమెరాలను పరిశీలించారు. నానో యరియా, నానో డీఏపీ వంటి సేంద్రియ ఎరువులను, కషాయాలను పరిశీలించారు. అనంతరం నచ్చనేరిలో వరినాట్లను పరిశీలించారు. డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి, టీడీపీ నాయకులు గురవారెడ్డి, ధనంజయులు నాయుడు, నాగరాజు నాయుడు, శివశంకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, పొన్నారావు, డీఆర్‌డీఏ పీడీ, తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, ఏవో సాగరిక, ఏడీఏ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నదీ హారతుల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యే, ఈవో

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉత్తర వాహినిగా ప్రవహించే స్వర్ణముఖి నదిలో బుధవారం నదీ హారతులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఉదయం ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

దుకాణం కూల్చివేస్తే బతికేదెలా?

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి



శ్రీకాళహస్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుకాణం కూల్చివేస్తే తాను బతికేది ఎలా ఆవేదన చెందుతూ సిరి అనే యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ముక్కంటి ఆలయం 4వ గేటుసమీపంలోని సన్నిధి వీధిలో అధికారులు బుధవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఆక్రమణలను తొలగించారు. ఇందులో భాగంగా అక్రమ నిర్మాణంగా ఉన్న దుకాణాన్ని తొలగించారు. ఈ సమయంలో ఉపాధి కోల్పోతే ఎలా బతకాలని యువతి సిరి అధికారులకు విన్నవించింది. తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ పక్కనే ఉన్న లాడ్జిలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకునే ప్రయత్నం చేసింది. అక్కడున్న వారు ఆమెను అడ్డుకుని సర్ది చెప్పారు.

మేలచ్చూరు విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్సు

జెండా ఊపి సర్వీసును ప్రారంభించిన డీఈవో



బస్సును ప్రారంభిస్తున్న డీఈవో కుమార్

ఏర్పేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేలచ్చూరుకు చెందిన పేద విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సును డీఈవో ప్రారంభించారు. మేలచ్చూరుకు చెందిన పలువురు విద్యార్థులు ఏర్పేడు మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. వారికి బస్సు సౌకర్యం లేక చాలామంది విద్యార్థులు తిరుపతి, వెంకటగిరి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ చొరవ తీసుకుని ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. మేలచ్చూరు విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈడీ చెంగల్‌రెడ్డి వెంకటగిరి ఆర్టీసీ డిపో మేనేజరు రామకృష్ణకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద డీఈవో కె.వి.ఎన్.కుమార్ ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో బస్సుల కొరత ఉన్నప్పటికీ విద్యార్థుల సౌకర్యార్థ సర్వీసు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎంఈవోలు ప్రేమలత, దయాకర్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం



ఏర్పేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయానికి పానాయుడుపేట స్వర్ణముఖి నది ఆనుకుని బైపాస్ రోడ్డును దాతల సహకారంతో నిర్మించారు. ఈ రోడ్డులో శాశ్వ త రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.2.32కోట్లు మంజూరు చేయించారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామ చంద్రారెడ్డి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గుడిమల్లం ఆలయ తీర్థప్రసాదాలను అందించారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీవీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీఆర్‌సీ ఒప్పందం, బాలల హక్కులపై ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోర్డినేటర్ నారాయణ అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సునీత మాట్లాడుతూ... బాలలు తమ బాధ్యతలను గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది చంద్రశేఖర్, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

అధ్వాన పారిశుధ్యం



బీవీపురం వీధిలో నిలిచిన నీరు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీవీపురంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలో పలుచోట్ల మురుగునీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో వీధిలోనే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అదే విధంగా తాగునీటి బోరు చుట్టు మురుగు నిల్వ ఉంటోంది. అధ్వాన పారిశుధ్యం కారణంగా తాము రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● తొట్టంబేడు మండలం ఎగువసాంబయ్యపాళెంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది.గ్రామంలో సుమారు 300 నివాస గృహాలు ఉన్నాయి. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. పారిశుధ్య నివారణపై ఎవరూదృష్టి సారించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అలాగే నివాస గృహాలకు దుర్గంధంసమస్య వెంటాడుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సాంబయ్యపాళెంలో చెత్తతో పేరుకుపోయిన వీధి







స్వర్ణముఖి నదీ హారతి సందర్భంగా సద్యోముక్తి వద్ద అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ ఘట్టానికి భక్తులు పోటెత్తారు. హారతుల అనంతరం స్వామిఅమ్మవార్లు చప్పరాలపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

రాష్ట్రపతి పర్యటన...
లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



రేణిగుంట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా రేణిగుంట పట్టణంలోని లాడ్జీల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం తెల్లవారు జాము నుంచి తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలో దిగిన వ్యక్తుల బ్యాగులను సోదా చేసి వారి ఆధార్ కార్డులను పరిశీలించారు.

విద్యార్థినికి అభినందనలు

వరదయ్యపాళెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 17 కరాటే పోటీలకు మండలంలోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.శ్రావ్య ఎంపికైంది. ఈనెల 16న తిరుపతిలో జరిగి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రధానోపాధ్యాయుడు మొహిద్దీన్, కరాటే మాస్టర్ కన్నయ్య తదితరులు శ్రావ్యను అభినందించారు.

ఈ -ఆటోల పంపిణీ



ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్త తరలింపు కోసం ప్రభుత్వం అందించిన ఈ -ఆటోలను ఎమ్మెల్యే ఆదిమూలం పంపిణీ చేశారు. మండలంలోని శిరుణంబుదూరు, మల్లవారిపాళెం వెస్ట్ పంచాయతీలకు నూతన ఆటోలను మల్లవారిపాళెం వెస్ట్ సర్పంచ్ పార్వతికి, శిరుణంబుదూరు సర్పంచ్ జానకికి అందించారు.